

రోడ్డుకడ్డంగా బోల్తాపడ్డ ట్రాక్టర్

కేవీబీపురం ప్రధాన రోడ్డు మార్గంలో ట్రాక్టర్ బోల్తాపడింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. - 8లో



ఆగని గజ దాడులు

చంద్రగిరి నియోజకవర్గం, చిన్నగొట్టిగల్లు మండలంలో గజరాజుల దాడులు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. - 8లో



నయనానందకరం..

శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో 60 వేల ఎకరాల్లో మామిడి సాగు



తిరుపతి అర్బన్: జిల్లాలో ఈ సారి 60 వేల ఎకరాల్లో మామిడి సాగుచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. 15 వేల మంది రైతులు ప్రత్యక్షంగా మామిడి సాగుతోనే జీవనం సాగిస్తున్నారు. మొత్తంగా తిరుపతి జిల్లాలో 50 వేల కుటుంబాలు మామిడి ఆధారంగా తమ జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. మామిడిలో చీడ పీడల నివారణకు సంబంధిత అధికారుల సూచనల మేరకే మందులు వాడాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య సూచించారు. పురుగు మందుల వ్యాపారులు లేదా మందులు స్ప్రే చేసే వారి ప్రమేయం ఉండకూడదన్నారు. అంతేకాకుండా రైతులు సొంతంగా ఏ మందు పడితే ఆ మందులు వాడడం మంచి పద్ధతి కాదన్నారు. ముందుగా రైతులు పూతను రక్షించుకోవాల్సి ఉంటుందని, పూత రక్షణకు అధికారులు ఇచ్చే సలహాలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి సూచించారు.

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభమవుతాయని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామి వారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, నంది సేవ, రాత్రి లింగోద్భవం, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, మార్చి 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న రాత్రి పల్లకీసేవ, 5న ఏకాంత సేవ, 6న శాంతి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, బిల్వనిమజ్జనం జరగనుంది. రాత్రి 7 గంటలకు స్వర్ణముఖిలో నదీ హారతులు జరగనున్నట్టు ఈఓ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గరుడ వాహనంపై చిద్విలాసం



బంగారు గరుడ వాహనంపై ఆశీనులైన లక్ష్మీనరసింహ స్వామి

రాపూరు: పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి చందనాలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించారు. స్వామివారికి ఉదయం అభిషేకం, చందనాలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం శ్రీవారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి మేళతాళాల నడుమ పెంచలకోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.



వైకుంఠనాథుడి అలంకరణలో పెద్ద శేష వాహనంపై శ్రీవారి పట్టపురాణి







అ‘శేష’ సంతోషిణి..జ్ఞానదాయని!

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం ఉదయం పెద్ద శేష వాహనంపై పరమపద వైకుంఠనాథుని అలంకరణలో అమ్మవారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీవారి ప్రియసఖి అయిన శ్రీ పద్మావతి అమ్మవారు హంస వాహనంపై వీణ చేతబట్టి సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాకారులు పోటీలు పడిమరీ తమ ప్రతిభను చాటి భక్తులను ఆకట్టుకున్నారు. వాహన సేవల్లో తిరుమల పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వాములు, ఈఓ శ్యామలరావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, అర్చకుడు బాబు స్వామి పాల్గొన్నారు.

– చంద్రగిరి



హంస వాహనంపై సరస్వతీదేవి అలంకరణలో శ్రీపద్మావతి అమ్మవారు

ఆమే ఆధారం!

కుటుంబానికి ఆసరాగా ఉన్న భర్త దూరమైతే.. ఏడడుగులూ నడిచి.. జీవితాంతం తోడుంటానని బాసలు చేసి మధ్యలోనే వెళ్లిపోతే.. అప్పటిదాకా అతనిపైనే ఆధారపడి జీవితాన్ని నెట్టుకొస్తున్న ఆ ఇల్లాలిపై కుటుంబ భారమంతా పడితే.. ఆ కష్టం.. నరకం ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేం. కొందరు మహిళలు మగదిక్కులేదన్న బాధతో కుమిలిపోతున్నారు. మరి కొందరు ఆ దుఃఖాన్ని దిగమింగుకుని కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకుంటున్నారు. నమ్ముకున్న వృత్తినే దైవంగా భావించి.. పిల్లల పోషణ నుంచి వారి చదువులు.. పెళ్లిళ్లు.. మనవళ్లు. మనవరాళ్ల వరకు ఆ కుటుంబాలకు వారే ఆధారంగా నిలుస్తున్నారు. ఒంటరిగా ఉన్నా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నారు. చేనేత వృత్తిలో ఆకట్టుకునే వస్త్రాలు నేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో కొందరి మగువల స్థితిగతులపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..



నూలు వడుకుతున్న చేనేత కార్మికురాలు



సైదాపురం: జిల్లాలోని వెంకటగిరి, నారాయణవనం, పుత్తూరు తదితర మండలాల్లో చేనేత కుటుంబాలు సుమారు 15,475 వరకు ఉన్నాయి. అందులో సొంత మగ్గాలు ఉన్న నేతన్నలు 4,250 మంది వరకు ఉన్నారు. ప్రతి ఇంట్లో ఆ ఇంటి ఇల్లాలి చేయి పడందే మగ్గం ముందుకు కదలదు. అచ్చు అతకడం, కండెలు చుట్టడం, పేక తోడడం, అల్లుపట్టడం, పడుగుపేక సరిచేసుకోవడం.. లాంటి పనులన్నీ మహిళలే చేస్తుంటారు. ఆ తర్వాత మగ్గంపై ఏర్పాటు చేసుకుని పురుషులు చీరలు నేస్తుంటారు. ఇలా అన్ని పనుల్లో అతివలే ప్రధాన భూమిక పోషిస్తుంటారు. అలాగే కుటుంబంలోని సభ్యులంతా తలో చేయి వేసి నేత పనిని ముగిస్తుంటారు. మగదిక్కు లేకపోయినా కొందరు మహిళలు కుమిలిపోకుండా ఒంటి చేత్తో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. నమ్ముకున్న వృత్తినే దైవంగా భావించి బతుకుబండిని లాగిస్తున్నారు. కొందరు మహిళలైతే స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. అచ్చు అతకడం, అల్లుపట్టడం, నేత పనులు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



మగ్గం నేస్తున్న మహిళ

ఊహ తెలిసినప్పటి నుంచి..



ఊహ తెలినప్పటి నుంచి చేనేత పనులే జీవనాధారం. భర్త కూనా వెంకటసుబ్బయ్య గత ఐదేళ్ల క్రితం మతిస్థిమితం లేక ఎటో వెళ్లిపోయాడు. ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాలేదు. జీవనం కష్టమవుతున్న తరుణంలో మేము నమ్ముకున్న చేనేత అనుబంధ రంగాలైన నూలుతోడడం, అచ్చు అతకడం పనులు స్వయంగా చేసుకుంటూ.. వచ్చిన నగదుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

–కూనా భాగ్యమ్మ, చేనేత కార్మికురాలు, వెంకటగిరి

మగ్గమే జీవనాధారం



కుటుంబానికి తోడుగా ఉంటాడనుకున్న భర్త సజ్జా రమణయ్య గతంలోనే మృతి చెందాడు. చేనేత పరిశ్రమను నమ్ముకుని 12 ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా. ఒంటరిగా నేత పనులు సాగించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

–సజ్జాగౌరి, చేనేత కార్మికురాలు, వెంకటగిరి

ఆధారం ఇదే



నా భర్త దోపర్తి సుబ్బారావు 2017లో మృతి చెందాడు. అప్పటి వరకు మగ్గాలు నేసుకుంటూ సాఫీగా సాగుతున్న మా కుటుంబం ఒక్కసారిగా స్తంభించిపోయింది. ఏమి చేయాలో తెలియక చేనేత పనులే నమ్ముకుని ఒంటరిగా రాణిస్తున్నా. నేత పనుల్లో వచ్చిన అరకొర నగదుతోనే జీవితాన్ని నెట్టుకొస్తున్నా.

– దోపర్తి పార్వతమ్మ, చేనేత కార్మికురాలు, వెంకటగిరి

చేదోడువాదోడుగా..



నా భర్త మోపూరు నరసింహులు 20 ఏళ్ల క్రితం దూరమయ్యారు. అప్పటి నుంచి నా కుమారుడు జానకీరామ్‌కు చేనేత పనుల్లో చేదోడువాదోడుగా ఉండేదాన్ని. జాలిలేని ఆ దేవుడు మాపై మరోసారి పగబట్టాడు. నా కొడుకు జానకీరామ్ పక్షవాతంతో నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఇటు భర్తదూరమై, అటు కొడుకు అనారోగ్యం పాలవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయా. కానీ నమ్ముకున్న వృత్తినే దైవంగా భావించి చేనేత అనుబంధ రంగాల్లో రాణిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

– మోపూరు కమలమ్మ, చేనేత కార్మికురాలు, వెంకటగిరి

40 ఏళ్లుగా ఒంటరిగానే..

మాది బంగారుపేట గ్రామం. మా ఆయనది నారాయణవనం. 40 ఏళ్లపాటు మా దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఆపై నా భర్త అర్ధంతరంగా నన్ను విడిచివెళ్లిపోయాడు. నేను ఒంటరిగా మిగిలా. వయసు మీదపడింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో స్వగ్రామమైన బంగారుపేటకు వచ్చి చేనేత అనుబంధ రంగాల్లో పనులు చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నా.

– మోపూరు వీరరాఘమ్మ, చేనేత కార్మికురాలు, బంగారుపేట

యోగా శిక్షణపై చర్యలేవీ?

- పార్లమెంటులో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : గ్రామీణ మహిళలకు యోగా శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా..? అలా అయితే రాష్ట్రాల వారీగా వివరాలు తెలపాలని, లేని పక్షంలో అందుకు గల కారణాలు చెప్పాలంటూ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందుకు ఆయుష్ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానమిచ్చారు. స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థల ద్వారా గ్రామీణ మహిళలతో సహా ప్రజలకు యోగా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఆయుష్ మంత్రిత్వశాఖ తన మూడు స్వయంప్రతిపత్తి సంస్థలైన న్యూ ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, నేచురోపతి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి ద్వారా యోగాను ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు.



పార్లమెంట్ సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అనేది యోగా, నేచురోపతి వ్యవస్థల్లో పరిశోధన, అభివృద్ధికి అత్యున్నత సంస్థగా పేర్కొన్నారు. ఈ మూడు సంస్థల కార్యకలాపాలు, ప్రోగ్రామ్‌లు వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాల ద్వారా 12,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు కార్యాచరణను అమలు చేస్తున్న ట్టు వెల్లడించారు. అర్హత కలిగిన యోగా శిక్షకుల ద్వారా గ్రామీణ మహిళలతో సహా ప్రజలకు యోగా బోధిస్తున్నట్టు సమాధానం చెప్పారు.

నదీ హారతికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వర్ణముఖి నదిలో స్వర్ణమ్మ హారతులకు సుమూహూర్తం నిర్ణయించారు. వారం రోజులుగా ఈఓ బాపిరెడ్డి ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయించారు. అయితే పెంగల్ తుపాన్ కారణంగా ఓ మోస్తరు వర్షం పడే అవకాశాలు ఉండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. వేలాది మంది వస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేశారు. అయితే జల వినాయకుడు సమీపంలో యాత్ర కోసం ఏర్పాటు చేసిన వేదిక వద్ద కన్నప్ప వంతెన కింద చెత్త, రాళ్లు, మట్టి పేరుకుపోయాయి. వాటిని శుభ్రం చేసి బారికేడ్లు ఏర్పాటు చేస్తే వర్షం వచ్చినా భక్తులు దాని కింద కూర్చుని వీక్షించే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సివుంది.



నదీ హారతికి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సీఎంకు సాదర వీడ్కోలు


సీఎం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: చంద్రగిరి మండలం, నారావారిపల్లెలో సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియల ప్రక్రియ పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం 11.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు పయనమైన సీఎం చంద్రబాబునాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. ఆయనకు విమానాశ్రయంలో డీఐజీ షిమోషిబా జీపేయ్, కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్య, జేసీ శుభం బన్సల్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థినులు

శ్రీకాళహస్తి: నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారిణులు ప్రతిభ చాటారు. అందులో శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థిని రమ్య విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా హర్షిత అనే విద్యార్థిని కూడా ప్రతిభ చూపింది. ఈమె 70వ సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా వారిని చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథంనాయుడు, అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ అభినందించారు.

నయనానందకరం..
స్నపన తిరుమంజనం


సంప్రదాయ పుష్పాలు, యాపిల్, ద్రాక్ష తదితర ఫలాలతో అలంకరించిన మండపంలో కొలువైన అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం అమ్మవారికి స్నపన తిరుమంజనాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా ఈ వేడుక చేపట్టారు. కంకణభట్టర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం చేపట్టారు. అనంతరం ఛత్ర చామర, వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం సమర్పించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ల, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. శంఖుధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణ

స్నపన తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ఏడు రకాల మాలలను అలంకరించారు. ఒక్కో క్రతువులో ఒక్కో మాల వంతున ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. నెమలి ఈకల మాల, తాయార గింజలు, ఫైనాపిల్, రోజ్ పెటల్స్, నెల్లికాయ, తులసి, రంగురాళ్లతో కూడిన రోజా మాలలు అమ్మవారికి అలంకరించారు.

ఆకట్టుకున్న మండపం

స్నపన తిరుమంజనం నిర్వహించే శ్రీ కృష్ణముఖ మండపాన్ని వివిధ రకాల సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్, అపురూపమైన పుష్పాలు, రెడ్, గ్రీన్ యాపిల్, మొక్కజొన్న, జామ, ఆరంజీ తదితర ఫలాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ మండపాన్ని 20 మంది టీటీడీ గార్డెన్ సిబ్బంది రెండు రోజుల పాటు శ్రమించి అలంకరించారు. అలాగే అమ్మవారి ఆలయంలోని ధ్వజ మండపం, గర్భాలయం, శ్రీకృష్ణస్వామివారి ఆలయం, శ్రీసుందరరాజస్వామివారి ఆలయం, వాహన మండపం, ఆస్థాన మండపం టీటీడీ గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 70 మంది సిబ్బంది మూడు రోజుల పాటు శ్రమించి సుందరంగా అలంకరించారు. జేఈఓ గౌతమి, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.




సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ఈఓ శ్యామలరావు


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గుండెపోటుతో భక్తుడి మృతి


మృతుడు సమ్మారావును శ్రీవారిమెట్టు మార్గం గుండా కిందకు తీసుకొస్తున్న సిబ్బంది

చంద్రగిరి: శ్రీవారిమెట్టు మార్గంలో గుండెపోటుతో భక్తుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తిరుమల పోలీసుల వివరాల మేరకు.. వరంగల్ జిల్లా, హనుమకొండకు చెందిన సమ్మారావు(54) శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిమెట్టు మార్గం గుండా కాలినడకన తిరుమలకు పయనమయ్యాడు. 500వ మెట్టు వద్దకు వచ్చేసరికి సమ్మారావుకు బీపీ ఎక్కువై కుప్పకూలిపోయాడు. అనంతరం కుటుంబ సభ్యులు స్థానిక భక్తుల సహకారంతో టీటీడీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక వ్యాపారులు, ఉద్యోగుల సహకారంతో శ్రీవారిమెట్టు మార్గం గుండా కిందకు తీసుకొచ్చారు. ఆపై ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.

ఆగని గజ దాడులు


ధ్వంసమైన టమాట తోట

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలంలో గజరాజుల దాడులు ఆగనంటున్నాయి. గత వారం ఓ ఏనుగు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తూ నష్టం చేకూర్చుతోంది. గురువారం రాత్రి చిట్టిచెర్ల, దేవ్‌దార్లపల్లె పంచాయతీ పరిధిలోని మామిడి, టమాట పంటలను ధ్వంసం చేశాయి. గ్రామ సమీపంలోకి ఏనుగులు వస్తుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తవ్వావాండ్లపల్లె వద్ద ఉన్న పొలాల్లోకి వచ్చిన ఏనుగుల గుంపు మామిడి, పనస, టమాట పంటలను తొక్కి నాశనం చేసింది. షెడ్లను సైతం ధ్వంసం చేశాయి. ఏనుగుల రాకను అరికట్టేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుండీలకు కూటమి రంగు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టణంలో పచ్చదనం నింపేందుకు ఏర్పాటు చేసిన కుండీలకు కూటమి రంగులు వేశారు. స్వర్ణముఖి నది కన్నప్ప వంతెన ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన కుండీలలో మొక్కలు చనిపోయాయి. తిరిగి మళ్లీ మొక్కలు నాటాలని పలుమార్లు మొత్తుకుంటున్నా పట్టించుకోని అధికారులు నదీహారతికి సన్నద్ధమవుతున్న తరుణంలో కుండీలకు పసుపు, ఆరంజ్ రంగులు వేయడం విమర్శలకు తావిస్తోంది. గతంలో నీతులు చెప్పిన నేతలు ఇప్పుడు కూటమి రంగులు ఎలా అద్దుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సనాతన సంస్థలను పరిరక్షించాలి


మాట్లాడుతున్న వెలగపూడి ప్రకాశరావు

తిరుపతి కల్చరల్: తిరుమల, తిరుపతి, తిరుచానూరు కారిడార్‌ను పుణ్యక్షేత్రంగా ప్రకటించి, తద్వారా పవిత్ర సనాతన సంస్థలను పరిరక్షించాలని జీహెచ్‌హెచ్‌ఎఫ్ వ్యవస్థాపకుడు వెలగపూడి ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాలయాలను తన నియంత్రణ నుంచి విముక్తి చేసి క్రైస్తవులు, ముస్లిం చర్చిలు, మసీదుల నిర్వహణ తరహాలో స్వయం ప్రాతిపదికతను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జీహెచ్‌హెచ్‌ఎఫ్ ప్రతినిధులు సుబ్రమణ్యం యాదవ్, రామదేవి, కిరణ్, విజయలక్ష్మి, ప్రసాద్, వేణుగోపాల్‌రావు, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ ఆనవాళ్లే లేవు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృ వర్సిటీలో విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తున్నారని ఇటీవల వచ్చిన ఆరోపణలు అవాస్తమని రిజిస్ట్రార్ రమాశ్రీ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అనుమానిత విద్యార్థులను పరీక్షించిన ఫిజికల్, లేబొరేటరీ ప్రయోగశాల నివేదికలు డ్రగ్స్ ఆనవాళ్లు లేవని తేల్సినట్టు వెల్లడించారు. ఆరోపణలు వచ్చిన ఇద్దరు విద్యార్థులను రుయా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా.. ఎటువంటి డ్రగ్స్ వినియోగించలేదని తేలిందని తెలిపారు.

రోడ్డుకడ్డంగా బోల్తా పడ్డ ట్రాక్టర్

వరదయ్యపాళెం: కట్టెల లోడ్డుతో వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డుకడ్డంగా పడడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ఘటన నియోజకవర్గంలోని కేవీబీపురం ప్రధాన రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. కేవీబీపురం మండలం, రాగిగుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన రోడ్డు మార్గంలో కట్టెల లోడ్డుతో వెళ్తున్న ట్రాక్టర్ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. దీంతో రోడ్డుకు ఒకవైపున లారీ వెళ్లేందుకు ప్రయత్నించగా ఆ లారీ కూడా దిగబోటుకు గురైంది. దీంతో వాహనదారులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 2 గంటలకు పైగా రాకపోకలు స్తంభించాయి. అటు శ్రీకాళహస్తికి, ఇటు కేవీబీపురానికి వెళ్లే వాహనాలు బారులు తీరాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధించారు.

ఏడుగురు ఎర్ర కూలీలకు ఆరేళ్లు జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న కేసులో ఏడుగురికి ఒక్కొక్కరికీ ఆరేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 జూన్ 26వ తేదీ శేషాచలం అటవీ ప్రాంతం, కరకంబాడి బీట్, టీఎన్ పాళెం సెక్షన్‌లోకి అక్రమంగా ప్రవేశించి ఎనిమిది ఎరచందనం దుంగలను నరికి తరలిస్తుండగా కరకంబాడి– మంగళం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఫారెస్ట్ అధికారులు ఏర్పేడు మండలం, రాజుపాళెంకు చెందిన అద్దంకి గంగాధరం, రాజులకండ్రిగకు చెందిన తుపాకుల శ్రీనివాసులు, వడమాలపేట మండలం, ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల గంగయ్య, రామసముద్రానికి చెందిన గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టీ.బంగారయ్య, తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, తిరుత్తణి తాలూకా, బుచ్చిరెడ్డిపల్లికి చెందిన కే.మురగయ్యను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పదోమైలు గ్రామ సమీపంలోని కేటీరోడ్డు మలుపు వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొంది. శ్రీకాళహస్తి నుంచి బుచ్చినాయుడుకండ్రిగకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

స్విమ్స్ సెక్యూరిటీ నిజాయితీ

–బంగారు ఆభరణాలు, నగదు అప్పగింత


ఆభరణాలు అప్పగిస్తున్న స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి తుడా: స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది మరోసారి తమ నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. ఈఎమ్‌డీ ఐసీయూలో చికిత్స పొందుతున్న తిరుపతి రూరల్ మండలం, ధనలక్ష్మి నగర్‌కు చెందిన వనజ ఎంఆర్‌ఐ స్కానింగ్ నిమిత్తం స్విమ్స్ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది. స్కాన్ చేసే సమయంలో ఆమె దగ్గర ఉన్న విలువైన వస్తువులు, డబ్బు ఆమె సహాయకురాలు బీ.మంజుల వద్ద విడిచివెళ్లగా, ఆమె అదే ప్రాంతంలో పొరబాటున జారవిడుచుకుంది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఎస్ఎల్ఎస్ఎంపీసీ శానిటరీ వర్కర్ వై.క్రిష్ణవేణి దీనిని గమనించి సెక్యూరిటీ సిబ్బందికి అందజేశారు. సెక్యూరిటీ సిబ్బంది కరెంట్ బిల్లు ఆధారంగా రోగి అడ్రస్సు కనుక్కొని.. అందులో ఉన్న సుమారు రూ.1,50,000 విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు నగదు రూ.1,480 గుర్తించారు. సెక్యూరిటీ ఆఫీసర్ పేషంట్ సహాయకురాలును ఆరా తీసి అంగీకర పత్రంతో దొరికిన వస్తువులను అప్పగించారు. ఈ సందర్భంగా రోగి సహయకురాలు సిమ్స్ యాజమాన్యానికి, సెక్యూరిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్విమ్స్ సెక్యూరిటీ, విజిలెన్స్ ఆఫీసర్ ఇలంగోవన్‌రెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది పవన్ కుమార్, రాజేష్ శానిటరీ వర్కర్ వై.క్రిష్ణవేణిని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, అధికారులు అభినందించారు.

పింఛన్లకు కత్తెర!



- ప్రతి నెలా తరిగిపోతున్న పింఛన్లు
- మళ్లీ 852 మంది తొలగింపు
- ఆరు నెలల్లో 6,547 మంది పింఛన్లకు కత్తెర
- నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు ప్రతి నెలా తరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల్లో 6,547 మంది పింఛన్లు తొలగించారు. ప్రతి నెలా వెయ్యి మంది వరకు పింఛన్లలో కోత విధిస్తున్నారు. ఎందుకు తగ్గించారని ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని అధికారులు సమాధానం దాటవేస్తున్నారు. తొలగించిన లబ్ధిదారుల పేర్లు తెలియజేయాలని కోరితే...తమవద్ద జాబితా లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. తాజాగా డిసెంబర్‌లో 852 మంది పింఛన్లు తొలగించారు.

వారికే కొత్త పింఛన్లు

ఆరు నెలలుగా కొత్త పింఛన్లు లేకపోగా.. వితంతువులు మాత్రమే పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భర్తలు చనిపోయిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. అంటే జనవరి 1 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు భర్తలు చనిపోయిన వితంతువులు అర్హులు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు నిట్టూర్పుతున్నారు. జనవరి నుంచి డిసెంబర్ వరకు సుమారు 2 వేల మంది వరకు వితంతువులు ఉన్నారని, అందరికీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఆ హామీ ఏమైనట్టో?

సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45 ఏళ్లకే పింఛన్ పంపిణీ చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ప్రతి ఏటా జూన్‌లోను, డిసెంబర్‌లోను కొత్త పింఛన్లు ఇచ్చేవారు. జూన్ వరకు కొత్త పింఛన్ల కోసం 5,500 మంది దరఖాస్తు చేసుకుని ఉన్నారు. రెండో విడతగా డిసెంబర్‌లోనైనా ఇస్తారని మరో 5,500 మందికి పైగా దరఖాస్తులు సమర్పించారు. అయితే నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు కేవలం నెల రోజుల వ్యవధిలోని వితంతువులకు మాత్రమే కొత్త పింఛన్లకు అర్హులని పేర్కొనడం పై పలువురు మండిపడుతున్నారు.


పింఛన్ల పంపిణీలో అధికారులు (ఫైల్)

జిల్లాలో పింఛన్ల వివరాలు

నెల	లబ్ధిదారుల సంఖ్య
జూన్	2,71,183
జూలై	2,69,162
ఆగస్టు	2,67,772
సెప్టెంబర్	2,67,089
అక్టోబర్	2,66,342
నవంబర్	2,65,488
డిసెంబర్	2,64,636

పింఛన్ల కోత ఇలా..

నెల	తొలగించిన పింఛన్లు
జూలై	2,021
ఆగస్టు	1,390
సెప్టెంబర్	683
అక్టోబర్	747
నవంబర్	854
డిసెంబర్	852

పింఛన్లు తగ్గిన మాట వాస్తవమే



కూటమి ప్రభుత్వంలో పింఛన్లు తొలగించలేదు. అయితే జూన్ నుంచి డిసెంబర్ వరకు ఈ ఆరు నెలల్లో 6,547 ఫించన్లు తగ్గిన మాట వాస్తవమే. కొందరు మృతి చెందారు. మరికొందరు మూడు నెలలుగా పింఛన్ తీసుకోకుంటే తొలగించారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు వితంతువులైన వారు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన వారికి ఇంకా అవకాశం ఇవ్వలేదు.

–శోభనబాబు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, తిరుపతి జిల్లా

నేటి నుంచి పింఛన్లు పంపిణీ



డిసెంబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా ఫించన్లు శనివారం నుంచే పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి రూ.112.26 కోట్లు పంపిణీ చేయనున్నాం. పింఛన్‌దారులు ఇంటి వద్దే అందుబాటులో ఉండాలి. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికి వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు. –ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్